# చదువు విలువ

**— వై. కె. మూర్తి**

అలారం మోగగానే దోమతెరలో నుంచి చేయి బయటికిపెట్టి, అలారం ఆఫ్ చేసింది రాధ. శబ్దం ఆగిపోవడంతో వాతావరణం ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారినట్లు అనిపించింది. పక్కన పడుకుని హాయిగా నిద్రపోతున్న భర్త మోహన్‌ని చూస్తే ఒక్క క్షణం మనసులో అసూయ కలిగింది. 'ఆయన అదృష్టవంతుడు కాబట్టి మరో గంటసేపైనా హాయిగా పడుకుంటాడు' అనుకుంది.

ఆడపడుచు లీల గదిలో లైట్ వెలుగుతోంది. ఆమె ఎంసెట్‌కి తయారవుతోంది. లీలని చూస్తే రాధకి చిన్నతనం గుర్తుకొస్తుంది. చిన్నప్పుడు తనూ భవిష్యత్తు గురించి ఎన్నో కలలుకంది. ఆ కలలు ఆచరణలోకి రాకుండానే కలలుగా మిగిలిపోయాయి. పదవ తరగతిలో 86 శాతం మార్కులతో స్కూలు ఫస్ట్ వచ్చింది రాధ. తర్వాత ఇంటర్‌లో చేరింది. రెండో సంవత్సరంలో వుండగానే ఇంట్లో తన పెళ్లి గురించి మాట్లాడుకోవడం చూసి కంగారుపడింది. పెళ్లి తన చదువుకి అడ్డంకిగా నిలుస్తుందని, ఇప్పుడే వద్దని చెప్పాలనీ ఆమె అనుకోలేదు. పెళ్లి ఏదో ఒకరోజు జరగక తప్పదని, తన కలలోని రాజకుమారుడి రూపంలోనే పెళ్లికొడుకు ఉంటాడనీ అనుకుంది. కానీ...

వంటింట్లో స్టౌపై కాఫీపెట్టింది. పొద్దున్నే లేచి అంట్లుతోమడం విసుగ్గా వుంది. తను అనుకున్నదొకటి, జరుగుతున్నది మరొకటి. టీవీలో జాగింగ్ చేస్తున్న అమ్మాయిల్ని చూస్తూ తలుపుతెరుచుకుని వీధిలోకి పరుగెత్తుకెళ్లి చల్లటి గాలిలో స్వేచ్ఛగా, హాయిగా తిరగాలనిపిస్తుంది రాధకి. కానీ అలా చేయలేదు.

లీల కోసం కాఫీ తయారుచేసి తీసుకెళ్లింది. కాఫీ గ్లాసు తీసుకెళ్లి లీల టేబుల్ మీద పెట్టింది. ఆమె కన్నెత్తి కూడా దానివైపు చూడలేదు. 'తనకు తప్ప ఈ ఇంట్లోని వారెవరికీ తన విషయం పట్టదు. ఇంట్లో వారందరికీ ఎవరు మూడ్స్ వాళ్లకుంటాయి. ఎవరి ఇష్టాలు వారివి. వారందరికీ కావలసినవి చేసి అందివ్వడానికి తప్ప తనకంటూ వేరే కోరికలేవీ ఉండకూడదు కాబోలు' అనుకుంది. కానీ అంతలోనే 'ఛఛ అనవసరంగా ఆ అమ్మాయిని గురించి ఆలోచించి మనసు పాడుచేసుకోవడం ఎందుకు? ఎలాగూ ఒకటి రెండేళ్లలో పెళ్లిచేసుకుని వెళ్లిపోతుంది. తర్వాత ప్రశాంతంగా వుండవచ్చు' అనుకుంది.

డాక్టర్ అవ్వాలనే తన కోరిక తీరనందుకు రాధ అప్పుడప్పుడూ బాధపడుతూ ఉంటుంది. మరోసారి 'పోన్లే లీల అయినా తను అనుకున్న చదువు చదవగలుగు'తోందని మనసు స్థిమితపర్చుకునేది. లీలకి చదువు చెప్పించే భారం తన భర్త మోహన్ మీద పడటంతో ఆర్థిక ఒత్తిళ్లు బాగా పెరిగాయి. అత్తగారికి లీల అంటే వున్న ప్రేమ, గారాబం, తనని పురుగులా తీసేయడం, లీల మొండితనం... ఇవన్నీ ఆమె పెళ్లితోనే పరిష్కారమవుతాయని, అప్పుడు తను, అత్తగారు కలిసిమెలిసి హాయిగా వుండవచ్చు

నని' తనకు తానే సర్దిచెప్పుకుంటుంది రాధ.

క్రితం రోజు రాత్రి పొద్దుపోయేదాకా అత్త గారు, తన భర్తా చిన్నగా మాట్లాడుకున్నదాన్ని బట్టి ఆ శుభ ఘడియలు త్వరలో వచ్చే సూచ నలు కనిపించాయి. ఆమాట కొస్తే తాను తెలివి తేటలు, అవగాహన, నేర్పరితనం కలిగివున్న అమ్మాయి. అమ్మానాన్నల ఏకైక గారాల కూతు రు. ఇక్కడికి రాగానే తనలోని సుగుణాలన్నీ ఏమైపోయాయో అర్థం కావటం లేదు. ఆత్మ విశ్వాసం కోల్పోయింది. అందరితో నవ్వుతూ, చలాకీగా తిరుగుతూ వుండేది. తాను ఇప్పుడు ఎలావుందో...! ఎప్పుడైనా మోహన్ తన ఫ్రెండ్స్‌ని ఎవరినైనా పరిచయం చేస్తే ఎక్కడలేని తడబాటు వచ్చేస్తుంది.

అప్పుడప్పుడూ వినిపి స్తున్న తల్లీ కొడుకుల మాట లను బట్టి వీళ్లు లీల కోసం ఒక ఆర్మీ ఆఫీసర్ సంబం ధం చూస్తున్నారు. వాళ్లు బాగా ఉన్నవాళ్లు. పైగా అతను కట్నం తీసుకోడట. ఆ సంబంధం వదులుకోవడం వీళ్లకి ఏమాత్రం ఇష్టం లేదు.

మూడురోజుల తర్వాత లీలని చూసుకోవడానికి పెళ్లివాళ్లు వస్తున్నారన్న మాట విని రాధ చెవి లో అమృతం పోసి నట్లయింది. తన కష్టాలు ఇంత త్వ రగా తీరతాయ నుకోలేదు.

లీలను చూసుకోవడానికి పెళ్లి వారొస్తారు, ఇల్లు శుభ్రంచేయమని అత్తగారు చెప్పడంతో మునుపటి రాధగా మారిపోయింది. 'మీరేమీ కంగారు పడకండి అత్తయ్యా... అన్నీ నేను చూసుకుంటాను' అని భరోసా ఇచ్చింది.

వాళ్లు వచ్చి కూర్చునే గదిని అందంగా, ఆకర్షణీయంగా అలంకరిస్తుంటే 'కాసేపు విశ్రాంతి తీసుకోమ్మా అలసిపోయావ్' అని అత్త గారు అనడం ఆవిడలో వచ్చిన మార్పుని సూచి స్తోంది.



తన భార్యలోని చలాకీతనం, నేర్పరితనాన్ని మోహన్ మొదటిసారిగా చూస్తున్నాడు. ఆరోజే పెళ్లివారు వచ్చేది. లీలలో ఏమాత్రం ఉత్సాహం లేదు. ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నా... తల్లి, అన్నయ్య పట్టించుకునే స్థితిలో లేరు. చదువు, పరీక్షలు, భవిష్యత్తు ఇలాంటి మాటలు ఆ తల్లీ కొడుకులకు పట్టవు. వాళ్ల ఉద్దేశంలో మంచి భవిష్యత్తు అంటే ఆ వచ్చే పెళ్లికొడుకుతో లీల పెళ్లి జరగడం మాత్రమే.

కొద్దిసేపట్లో పెళ్లివారు వస్తారనగా లీలని తయారుచేద్దామని ఆమె గదిలోకి వచ్చింది రాధ. రాధని మింగేసేలా చూస్తూ 'వదినా నన్ను విసిగించకు. నువ్వు నన్నేం తయారుచేయనక్కర్లేదు. వెళ్లిపో' అని అరిచింది. అది చూసి మరేం మాట్లాడడానికి ధైర్యంచాలక ఆ పని అత్తగారికి అప్పజెప్పింది. సరిగ్గా నాలుగవుతూండగా పెళ్లికొడుకు రవీంద్ర తన అమ్మ, అన్నా వదినలు, ఇద్దరు చెల్లాయిలతో కలిసి వచ్చాడు. వారంతా మంచి, మర్యాద, సంస్కారం ఉన్నవాళ్లలానే వున్నారు. చెల్లెళ్లిద్దరూ మహా ఉత్సాహంగా, చలాకీగా వున్నారు. అతని వదిన ఎంతో కలుపుగోలుగా, ఆప్యాయంగా మాట్లాడుతోంది. అంత మంచివాళ్లు లీలకు దొరకుతున్నందుకు రాధకి అసూయగా అనిపించింది. కానీ మరుక్షణమే ఛీఛీ... ఇలా ఆలోచిస్తున్నానేమిటి? అనుకుంది. వాళ్లంతా ఎప్పట్నుంచో తెలిసిన వాళ్లలాగా మాట్లాడుతున్నారు.

ఇంతలో అత్తగారు లీలని తీసుకురమ్మని



హైదరాబాద్ ఆంధ్ర సారస్వత పరిషత్‌లో మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో సగ్గు రాజయ్య కథల సంపుటి 'లండన్ కోటు'ని ఆవిష్కరిస్తున్న పద్మభూషణ్ డాక్టర్ సి. నారాయణరెడ్డి. చిత్రంలో రఘుశ్రీ, గ్రంథకర్త, డా॥ ఎన్. గోపి, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, అంబల్ల జనార్ధన్ ఉన్నారు.

సైగచేశారు. లీల గదిలోకివెళ్లింది రాధ. బలికి సిద్ధంగా వున్న మేకపిల్లలా కూర్చునివుంది లీల. పిలిచిన వెంటనే అయిష్టంగానే లేచి వదినగారి వెంట వచ్చింది. అలాంటి సమయంలోనూ ఆ అమ్మాయి తన సహాయం అవసరం లేనట్టు ప్రవర్తించడం రాధకు కొంచెం బాధకల్గింది. 'ఇలాగే తనను చూసుకోవడానికి వచ్చారు. చూసారు, నచ్చానన్నారు. పెళ్లిజరిగిపోయింది. అంతే... ఆనాటి కుమారి రాధ ఈనాడు శ్రీమతి రాధగా మారిపోయింది. అప్పుడు తను... ఇప్పుడు లీల' అనుకుంది రాధ.

లీల రావడంతోనే అందరి చూపులూ ఒక్కసారిగా ఆమెపైకి మళ్లాయి. రవీంద్ర లీల అందాన్ని రెప్పవెయ్యకుండా చూస్తున్నాడు. వాళ్ల ముఖాల్లో కదలాడుతున్న భావాలను బట్టి వాళ్లందరికీ లీల నచ్చిందని అర్ధమవుతోంది. అత్తగారు, శ్రీవారు ఊపిరి పీల్చుకున్నట్లు కనిపించారు రాధకు. అక్కడ తాను ఒకదాన్ని ఉన్నాననే సృహ కూడా లేకుండా వాళ్లందరూ ఎలా మాట్లాడేసుకుంటున్నారో అనుకుంది రాధ. హఠాత్తుగా ఏదో గుర్తుకువచ్చినదానిలా లేచివెళ్లి రవీంద్ర ప్రక్కన కూర్చుని రవీంద్రవైపు తిరిగి 'మీతో ఒక విషయం మాట్లాడదామనుకుంటున్నాను' అంది.

'చెప్పండి'

'మా లీలకి చదువంటే మహా ఇష్టం, ఎంసెట్ రాస్తోంది. డాక్టరవాలని చిన్నప్పటి నుంచీ ఆమె కోరిక. ఆ కోరిక తీరేలా మీరు చూడగలరా?' సూటిగా అడిగింది.

రవీంద్ర కొన్ని క్షణాలు మౌనంగా ఉన్నాక 'అక్కయ్యగారూ లీల కలలు ఇకనుండి నా కలలు అవుతాయి. నేనెలాగూ మూడేళ్లపాటు అమెరికాలో వుండాలి. ఈలోగా ఇక్కడ లీల చదువుకోవచ్చు. నేను వచ్చేటప్పటికి లీల చదువు చాలామటుకు అయిపోతుంది' అన్నాడు.

అది విన్న రవీంద్ర వదిన 'అత్తమ్మా! మరిది గారి ఎంగేజ్‌మెంట్ ఇవ్వాళే కానిద్దాం, ఇలాంటి తోడికోడల్ని వదులుకోవడం నాకెంతమాత్రం ఇష్టంలేదు' అంది.

'నువ్వు కరెక్ట్‌గా చెప్పావ్. రవీంద్ర అమెరికా వెళ్లిపోవాలి కాబట్టి త్వరగా ఎంగేజ్‌మెంట్ కానిచ్చేద్దాం' అన్నారు రవీంద్ర అమ్మగారు.

'పట్టుచీర, పూలు, పండ్లు, కొబ్బరికాయ... అన్నీ సంప్రదాయం ప్రకారం తీసుకొచ్చి తాంబూలాలు పుచ్చుకున్నారు. భోజనాలైన తర్వాత వచ్చిన వాళ్లంతా ఎక్కడివాళ్లక్కడకు వెళ్లిపోయారు. సర్దుకోవడానికి రాధ వంటింట్లోకి వెళ్లింది. పనిచేసుకుంటుంటే ఎవరో వెనక నిలబడినట్లు అనిపించి వెనక్కి తిరిగి చూసింది. చెమ్మగిల్లిన కళ్లతో లీల నిలబడివుంది.

'ఏమైంది లీలా? ఎందుకలా వున్నావు?' ఆప్యాయంగా అడిగింది.

'వదినా! ఎవరూ చేయని సాహసం చేసి నా కోరిక తీర్చావు. నీకు ఎలా థ్యాంక్స్ చెప్పాలో తెలియడం లేదు' అంది మనస్ఫూర్తిగా.

'పిచ్చిదానా... నేనేం గొప్పపని చేసాను?' అయినా నువ్వేం నాకు పరాయి దానివి కావుగా. ఒకప్పుడు నేను కూడా నీలాగే డాక్టర్ కావాలని ఆశపడ్డాను. కానీ నాకప్పుడు ఎవరూ సహాయంగా నిలవలేదు. అందుకే చదువు విలువ నాకు బాగా తెలుసు.'

'వదినా! నువ్వు చేసిన సహాయం వల్ల నాలో కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. నువ్వు చేసిన ఉపకారానికి జీవితాంతం ఋణపడి ఉంటాను' అంది లీల వదిన భుజంపై తలవాలుస్తూ. ●